గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ దరఖాస్తులు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: అర్హత కలిగిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు తెలంగాణ స్టేట్ ఎస్సీ స్టడీ సర్కిల్ (టీఎస్ఎస్సీఎస్సీ) రంగారెడ్డిలో ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎ.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉద్యోగ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సెస్సీ అర్హత పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ శిబిరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా మార్చి 6 వరకు రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. మార్చి 10న జరిగే ప్రవేశ పరీక్షలో మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. 11 జిల్లా బ్రాంచ్‌లలో ఎక్కడైనా రెగ్యులర్‌గా 5 నెలల ఫౌండేషన్ కోర్సులో శిక్షణ తీసుకున్నవారు, హైదరాబాద్ రాష్ట్ర స్టడీ సర్కిల్ వద్ద సివిల్ సర్వీస్ కోసం కోచింగ్ తీసుకున్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కారని ఆయన పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబర్ ఫోన్: 96182 66091.

వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీఎంహెచ్‌ఓ డాక్టరు రఘునాథస్వామి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టుల వివరాలు ఈ విధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పిల్లల వైద్యుడు (1), రేడియాలజిస్ట్(2), మెడికల్ ఆఫీసర్(1-ఫుల్ టైం), డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్(1), జిల్లా డేటా మేనేజర్ (1), నర్సు(5), ఫిజియోథెరపిస్ట్(1), ల్యాబ్ టెక్నీషియన్(1), ఆరోగ్య సందర్శకుడు(2), రిఫ్రిజిరేటర్ మెకానిక్(1) ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను ఈ నెల 28 నుంచి మార్చి 5 వరకు సంబంధిత అభ్యర్థులు పూర్తిచేసి, రూ.200 (మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అనుకూలంగా) డీడీతో పాటు అవసరమైన ధ్రువపత్రాల కాపీలను సక్రమంగా జతపరచి, తమ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి

అవిశ్వాస గండం?

అవిశ్వాసం పెట్టే యోచనలో బీఆర్ఎస్ రెబల్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు
గండం నుంచి తప్పించుకునేందుకు కౌన్సిలర్లను విహార యాత్రకు తీసుకెళ్లిన చైర్మన్



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం



బ్యాంకాక్ టూర్‌లో చైర్‌పర్సన్ వర్గం కౌన్సిలర్లు, వైస్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యులు(ఫైల్)

మేడ్చల్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలకు తెర లేపి క్యాంపు రాజకీయాలు చేస్తుండగా ఇప్పుడు అవిశ్వాస గండం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ వచ్చిందా..? అంటే అవుననే సంకేతాలు కనబడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని జవహర్‌నగర్ కార్పొరేషన్‌తో పాటు తూంకుంట, నాగారం, మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ రెబల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో జతకట్టి అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సక్సెస్ అవ్వగా నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో అవిశ్వాసం వీగిపోయింది. ప్రస్తుతం ఇదే తరహాలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఎంపీ ఎన్నికలకు ముందు లేదా ఎన్నికల తర్వాత అవిశ్వాసం పెట్టే యోచనలో ఉన్న బీఆర్ఎస్ రెబల్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ దిశగా ముందడుగు వేస్తున్నారు.

గతంలో బుజ్జగింపులు..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 15 వార్డులు ఉండగా ఒకరు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు మినహా మిగతా 12 మంది బీఆర్ఎస్‌కు చెందినవారు. మున్సిపాలిటీ పరిధిలో గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, సుతారిగూడ, బాసిరేగడి, జ్ఞానాపూర్, అర్కల్‌గూడ గ్రామాలు ఉన్నాయి. మాజీ మంత్రి, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బావమరిది మద్దుల శ్రీనివాస్‌రెడ్డి భార్య మద్దుల లక్ష్మి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతుండగా కండ్లకోయకు చెందిన ప్రభాకర్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. గతంలో కౌన్సిలర్ల మధ్య విబేధాలు తలెత్తడంతో మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కొంత మంది కౌన్సిలర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకోగా.. గ్రహించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి కౌన్సిలర్లు అవిశ్వాసం ఊసెత్తకుండా చేయాలని బావమరిది, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్లను మలేషియా, సింగపూర్‌కు విహార యాత్రలకు తీసుకెళ్లి వారిని బుజ్జగించారు.

విహారయాత్రలకు తెరలేపిన చైర్‌పర్సన్ వర్గం..

అవిశ్వాసం పెట్టేందుకు రెబల్ కౌన్సిలర్లు యోచిస్తున్న తరుణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వర్గం విహారయాత్రలకు తెరలేపి క్యాంపు రాజకీయంతో బుజ్జగింపులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి తమ వర్గానికి చెందిన పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లగా మరికొందరు గోవా టూర్‌లో ఉన్నారు. ఎలాగైనా అవిశ్వాస తీర్మానం పెట్టకుండా చేయాలని, రెబల్ అభ్యర్థులు పట్టు విడవకుండా అవిశ్వాసం పెట్టినా వీగిపోయేలా ముందస్తుగా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే మల్లారెడ్డి తాను పుట్టిన ఊరు అని చెప్పుకునే మున్సిపాలిటీలో అవిశ్వాసం జరిగేలా చూడాలని కాంగ్రెస్ బడా నేతలు యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు మున్సిపాలిటీల్లో నెల కొన్న అవిశ్వాస లొల్లి సద్దుమనగకముందే తన దత్తత మున్సిపాలిటీలో అవిశ్వాసం లొల్లి మొదలవ్వడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రత్యేక చొరవతో రెబల్ కౌన్సిలర్లు అవిశ్వాసం ఊసెత్తకుండా చేసి తన పంతం నెగ్గించుకుంటాడా లేదా అనేది వేచి చూడాల్సిందే.

సొంత పార్టీ కుంపటికి తెరలేపారా..?

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ముగ్గురు మినహా మిగతా కౌన్సిలర్లు సొంత పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన వారే అయినప్పటికీ వారిలో కొందరు రెబల్‌గా మారడంతో సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస కుంపటికి తెర లేపినట్లుగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బాసిరేగడి, జ్ఞానాపూర్, అర్కల్ గూడ, సుతారిగూడ గ్రామాలకు చెందిన కౌన్సిలర్లు, గుండ్లపోచంపల్లికి చెందిన ఒక కౌన్సిలర్ రెబల్‌గా మారగా, ఇతర పార్టీలకు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు తిరుగుబాటు బావుట ఎగరేయాలని చూస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తమ గ్రామాల అభివృద్ధిపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం, ఆ వార్డుల కౌన్సిలర్లను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడక వల్లే అవిశ్వాసం పెట్టే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది.

అధికారం కోసం ఒక్కటిగా..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే మల్లారెడ్డి బావమరిది మద్దుల శ్రీనివాస్‌రెడ్డి భార్య లక్ష్మీ చైర్ పర్సన్‌గా ఉండటంతో ఆమెను గద్దెదించి అధికారం దక్కించుకోవాలని రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికార బీజేపీ పార్టీలు ఏకమవుతున్నాయి. బీఆర్ఎస్‌లో అసమ్మతితో ఉన్న కౌన్సిలర్లను ఆసరా చేసుకుని ముగ్గురు కౌన్సిలర్లు ఉన్న బీజేపీ, ఒక కౌన్సిలర్ ఉన్న కాంగ్రెస్ పార్టీలు చక్రం తిప్పాలని వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్‌కు చెందిన తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మరో నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ ఒక్కో బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్‌ను ఫాలోఅప్ చేస్తున్నారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి గుండ్లపోచంపల్లి వారు కావడం, మోహన్‌రెడ్డి భార్య సరస్వతీ కౌన్సిలర్ కావడంతో వారు కాంగ్రెస్‌తో జతకట్టి గుండ్లపోచంపల్లి రాజకీయం నడిపిస్తున్నారు. అధికారం తమ గుప్పిట్లో పెట్టుకుని చైర్మన్‌గా బీఆర్ఎస్ అసమ్మతి వారిని, వైస్ చైర్మన్‌గా బీజేపీ వారిని చేయాలని రాజకీయాలు చేస్తున్నారు.

తిప్పి కొడుతున్న మద్దుల

ప్రస్తుత చైర్ పర్సన్ లక్ష్మీరెడ్డి భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ అసమ్మతిని ఎప్పటికప్పుడు చల్లారుస్తూ బావ రూట్లో ఎప్పటికప్పుడు తాయిలాలు ఇస్తూ విదేశీ, స్వదేశీ ట్రిప్పులు తిప్పుతూ రాజకీయం చేస్తూ చైర్మన్ పదవి తన ఇంటి నుంచి దాటకుండా దిద్దుబాటు చర్యలు చేపడుతూ ఇతర పార్టీల నాయకుల ఎత్తులను చిత్తుచేస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ బలం, అర్థబలం, ఎమ్మెల్యే మల్లారెడ్డి బలం సంపూర్ణంగా ఉండటంతో ఆయన రాజకీయంలో ప్రత్యర్థులు చిత్తవుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి



శామీర్‌పేటలో 2కే నడక ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

శామీర్‌పేట్: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం శామీర్‌పేట మండల కేంద్రంలో 2కే నడక ర్యాలీని శామీర్‌పేట ఎంపీపీ యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, డిజిటల్ లావాదేవీలు చేసే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిన్, పాస్‌వార్డు, ఓటీపీ, సీసీవీ, బ్యాంకు ఖాతా నంబరు వంటి వివరాలను ఇతరులకు తెలుపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమత, ఎంఈఓ వసంతకుమారి, స్థానిక బ్యాంకుల సిబ్బంది, జెడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మేడ్చల్: పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటిని మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దాడులు చేసి అక్రమ భవనాలను గుర్తించి వాటిని కూల్చివేశారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 9వ వార్డులో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ పావనీ జంగయ్య, వైస్ చైర్మన్ మాధవ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నజీర్, నాగరాజుగౌడ్, ఆనంద్, సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామి ప్రతిష్ఠ మహోత్సవం



మల్లికార్జునస్వామి ప్రతిష్ఠ మహోత్సవాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తూ..

కీసర: చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణతో కలిసి హోమంలో పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు చామకూర మల్లారెడ్డికి స్వామివారి ఆశీర్వచనంతో పాటు, మహాప్రసాదాన్ని అందజేయగా ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌నేత మలిపెద్ది సుధీర్‌రెడ్డి కూడా పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలని వినతి



మూడో వార్డులో తెరుచుకుని ఉన్న మ్యాన్‌హోల్

మేడ్చల్: పట్టణంలోని 3వ వార్డులో ఏడాది క్రితం నిర్మించిన సీసీ రోడ్డులో మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయకపోవడంతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. మ్యాన్‌హోల్స్ నిర్మించి వాటిపై కవర్లు ఏర్పాటు చేయలేదని, కొన్నిచోట్ల ఏర్పాటు చేసినా అవి పూర్తిగా ధ్వంసం అయ్యాయని, అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

లక్ష్యాలను అధిగమించేలా మొక్కలు నాటాలి

హరితహారం కార్యాచరణపై జిల్లా కలెక్టర్ పి.గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: హరితహారంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా సంబంధిత జిల్లా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో హరితహారం కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత జిల్లా అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. హరితహారంలో భాగంగా గతేడాది రూపొందించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాల్లో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. మొక్కలు నాటడానికి అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. హరిత నిధిలో ఎన్ని మొక్కలు అందుబాటులో ఉందని పలు శాఖల అధికారులను ఆయన అడిగి తెలుకున్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎఫ్‌ఓ జానకిరామ్, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి రవీందర్, డీఆర్‌డీఓ సాంబశివరావు, ఉద్యానవన శాఖ అధికారి నీరజాగాంధీ, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి



మేడ్చల్ సీఐ సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు సంచరిస్తే డయల్ 100 లేదా మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాలంలో అనుమానితుల పేరుతో అమాయకులపై సైతం దాడులకు పాల్పడుతున్నారని, అది సరికాదన్నారు. అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇస్తే వారిని అదుపులోకి తీసుకుని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అలా కాదని వారిపై దాడులకు పాల్పడితే దాడి చేసిన వారిపై కూడా న్యాయపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్



మేడ్చల్ డిపోలో బంగారం, నగదు ఉన్న బ్యాగును అందజేస్తున్న అధికారులు

మేడ్చల్: బంగారంతో ఉన్న బ్యాగును మహిళా ప్రయాణికురాలు బస్సులో మరిచి బస్సుదిగి వెళ్లిపోగా ఆ బ్యాగును, బ్యాగులో ఉన్న నగదు, బంగారాన్ని సదరు ప్రయాణికురాలికి అప్పగించి తమ నిజాయితీ చాటుకున్నాడు మేడ్చల్ డిపోనకు చెందిన కండక్టర్ సత్రు, డ్రైవర్ బి.మహేష్. మేడ్చల్ డిపోనకు చెందిన 229 రూట్లో వెళ్లే బస్సులో డ్రైవర్ మహేష్, కండక్టర్ సత్రు డ్యూటీ చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్‌కు వస్తుండగా జి.సంతోషికుమారి అనే ప్రయాణికురాలు బ్యాగును సీటులో మరిచి బస్సు దిగివెళ్లిపోయింది. గమనించిన కండక్టర్ బ్యాగును స్వాధీనం చేసుకొని డిపో అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ప్రయాణికురాలికి సమాచారం ఇవ్వగా బంగారం, నగదు ఉన్న బ్యాగును అధికారుల సమక్షంలో మేడ్చల్ డిపోలో అందజేశారు. కండక్టర్, డ్రైవర్‌ను డిపో అధికారులు అభినందించారు. డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు, వెల్ఫేర్ సభ్యుడు రాములు తదితరులు ఉన్నారు.

అద్దెలు రాక.. జీతాలు అందక..

- అవస్థలు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు
- జిల్లాలోని 793 కేంద్రాల్లో 443 కేంద్రాలు అద్దె భవనాల్లోనే..
- 117 కేంద్రాల్లో నీటి కొరత.. మరుగుదొడ్లు లేనివి 118
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు.. గర్భిణులకు తప్పని పాట్లు



మేడ్చల్ కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందజేస్తూ.. (ఫైల్)

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో పసి పిల్లలు, గర్భిణులు, బాలింతలను పలు సమస్యలు కలవర పెడుతున్నాయి. పలు కేంద్రాల్లో ప్రధానమైన తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు సమస్య వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అద్దె భవనాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవడం ఒకవంతు అయితే సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాలకు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా చొరవ చూపడం లేదని తెలుస్తోంది.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఆరు నెలల నుంచి ఆరేండ్ల పిల్లలు 90.361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉండగా, మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, 47.028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివి 443

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 23 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

117 కేంద్రాల్లో నీటి కట.. కట

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీరు లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో నీటి సమస్య ఉంది.

మరుగుదొడ్లు అంతే..

జిల్లాలోని మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 118 అంగన్‌వాడీ కేంద్రాలలోల మరుగు దొడ్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. అలాగే అద్దె భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో టాయ్‌లెట్ కట్టించి ఇచ్చే పరిస్థితి లేదు.

6 నెలల అద్దెలు.. 3 నెలల జీతాలు రాక..

మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 443 కేంద్రాలు అద్దె భవనాల్లో మనుగడ సాగిస్తున్నాయి. ఈ అద్దె భవనాలకు ఆరు నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇంటి యాజమానుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొంటున్నారు. అలాగే, 793 అంగన్‌వాడీ టీచర్లకు గానూ 751 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 42 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, 779 ఆయా పోస్టులకు గానూ 741 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 38 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీల్లో ఖాళీలు సంగతి అటుంచితే.. ప్రస్తుతం పని చేస్తున్న 751 మంది టీచర్లు, 741 మంది ఆయాల(హెల్పర్లు)కు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటుకు పరిశీలన



పైపులైన్ ఏర్పాటుకు పరిశీలనలు చేస్తున్న అధికారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ గ్రామ ప్రజలకు మిషన్ భగీరథ నీటిని అందించేందుకు కొత్త పైపులైన్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. మండలంలోని గౌడవెల్లి చెరువు అలుగుల నుంచి సుతారిగూడలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వరకు అర కిలో మీటర్ మేర కొత్త పైపులైన్ వేసేందుకు మిషన్ భగీరథ ఏడీ వసుధ, మున్సిపల్ డీఈ దుర్గాప్రసాద్ పరిశీలించి అందుకయ్యే ఖర్చు అంచనాలు వేసి ప్రతిపాదనలు రూపొందించారు. సుతారిగూడ గ్రామ ప్రజలకు నీటి సమస్య తొలగించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు, వినతులు సమర్పించిన మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ముదిరాజ్ ఈ సందర్భంగా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టి గ్రామస్తులకు వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

పేదలపై ఎల్ఆర్ఎస్ అదనపు భారం


ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం.. రద్దు చేస్తాం.. ఉచితంగా చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం మార్చి 31లోపు రుసుము చెల్లించాలనడం సిగ్గుచేటని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలు రేషన్ కార్డుల కోసం దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్నారని, వారందరికీ ఇచ్చిన తర్వాతే గృహజ్యోతి, మహాలక్ష్మీ గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేయాలనుకున్న పథకాలను షరతులు లేకుండా పేదలందరికీ అందజేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఓ మాట, ఎన్నికల అనంతరం మరో మాట అనడం కాంగ్రెస్‌కు దక్కుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావుముదిరాజ్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మురళి (ఫైల్)

మేడ్చల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ గ్రామానికి చెందిన మోతెకాని మురళి(36) రెండేళ్ల క్రితం మేడ్చల్‌కు వలస వచ్చి చెక్‌పోస్ట్ సమీపంలో నివసిస్తూ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఒక్కడే ఇంట్లో ఉంటున్న మురళి నిత్యం మద్యం తాగుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో మరణించడంతో మంగళవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడు మద్యం అధికంగా సేవించడం వల్ల అనారోగ్యానికి గురై మరణించాడా లేదా ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్యతో పాటు పదేళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు.